


ట్రిపుల్ రోల్‌తో ట్రబుల్!

జడ్పీ సీఈవోకు మరో రెండు కీలక బాధ్యతలు



జిల్లా పరిషత్ కార్యాలయం

- ఏక కాలంలో మూడు విధులు
- కుంటుపడుతున్న జిల్లా పరిషత్ పరిపాలన
- పనులు కాక కాంట్రాక్టర్లు, ఉద్యోగులు సతమతం

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ వ్యవస్థలో జిల్లా పరిషత్ పాత్ర కీలకం. ఉన్నత స్థాయి పరిపాలన కొనసాగేది ఇక్కడి నుంచే. దీని పరిధిలో ఉండే మండలాలు, గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కార్యాచరణ జడ్పీ నుంచే అమలవుతుంది. ఇలా ఎంతో ప్రాధాన్యం కలిగిన భూపాలపల్లి జిల్లా పరిషత్ నిర్వహణ అగమ్యగోచరంగా మారింది. జడ్పీకి సీఈవో పాత్ర కీలకం కాగా ఆ అధికారిపైనే మరిన్ని అదనపు బాధ్యతలు మోపడం పరిపాలనపరమైన ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవీ కాలం ఇటీవల ముగిసింది. ఆ తర్వాత పూర్తి బాధ్యతలు జడ్పీ సీఈవో విజయలక్ష్మికి అప్పగించారు. ఈ బాధ్యతలతోపాటు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కూడా ఆమెనే కొనసాగుతున్నారు. ఇది చాలదు అన్నట్టు మునిసిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో మునిసిపల్ ప్రత్యేకాధికారి బాధ్యతలు కూడా విజయలక్ష్మికే కట్టబెట్టారు. ఇన్ని పాత్రలు ఏకకాలంలో ఆమె నిర్వర్తించడంతో జిల్లా పరిషత్ కార్యాలయ పనులు కుంటుపడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు జడ్పీలో కీలక పోస్టులు కొన్ని ఖాళీగా ఉండటం కూడా పరిపాలన అగమ్యగోచరంగా మారిందని తెలుస్తోంది.

పనులు కాక సతమతం

జిల్లా పరిషత్ కార్యాలయంలో కార్యకలాపాలు ముందుకు సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గతంలో చేసిన పనులకు, ప్రస్తుతం చేస్తున్న పనుల బిల్లుల జారీలో ఆలస్యమవుతోందనే ఆరోపణలు ఉన్నాయి. వీటితో పాటు ఉద్యోగుల జీపీఎఫ్ ఫైల్స్ ముందుకు సాగడం లేవనే విమర్శలు వస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా జడ్పీ అవసరాలను సుమారు 600 పైచిలుకు ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో వారికి అవసరమయ్యే జీపీఎఫ్ పనులు సరైన సమయంలో కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జడ్పీ సీఈవో అదనపు బాధ్యతలతో బిజీబిజీగా ఉండటంతో ఈ పనుల్లో ఉండటంతో కార్యాలయంలో అందుబాటులో లేక పనులు సాగడం లేదని అటు కాంట్రాక్టర్లు.. ఇటు ఉద్యోగుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. మరోవైపు జడ్పీలో సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడిందని తెలుస్తోంది. ప్రధాన అధికారి అందుబాటులో ఉండకపోవడంతో ఇష్టారాజ్యం నెలకొందనే విమర్శలు వస్తున్నాయి.

ఎలక్షన్లు వస్తే ఎలా..?

స్థానిక సంస్థలు దగ్గర పడుతున్నాయి. ఈ క్రమంలో జడ్పీ కార్యాలయం సీఈవో విధులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో పాటు మునిసిపల్ ప్రత్యేకాధికారి విధులు సైతం కీలకమే. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది.

మూడు కీలక విభాగాల్లో విధులు

భూపాలపల్లి జిల్లా పరిషత్ సీఈవోగా విజయలక్ష్మి 2023 ఏప్రిల్ 12న బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల)లుగా ఉన్న వెంకటేశ్వర్లు గత ఏడాది ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సీఈవోగా కొనసాగుతున్న విజయలక్ష్మికి ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి జిల్లా పరిషత్ కార్యాలయానికి ఆమె రావడం లేదని తెలుస్తోంది. కలెక్టరేట్ విధుల్లోనే ఆమె ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది జనవరి 26న మునిసిపల్ పాలకవర్గం పదవీ కాలం ముగిసింది. దీంతో ఈ నెల 27న మునిసిపాలిటీ ప్రత్యేకాధికారిగా విజయలక్ష్మికి బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో అటు జడ్పీ కార్యకలాపాలు, ఇటు అదనపు కలెక్టర్ విధులతో పాటు మునిసిపాలిటీ అభివృద్ధి కార్యకలాపాలపై దృష్టి పెట్టడం కష్టతరంగా మారుతోంది. ఫలితంగా ఏ శాఖకూ సరైన రీతిలో సేవలందించలేని పరిస్థితి నెలకొందని తెలుస్తోంది.

సమర్థంగానే పనిచేస్తున్నా..

- విజయలక్ష్మి, జిల్లా పరిషత్ సీఈవో



సమయానుకూలంగా నెలన్నర నుంచి ప్రతి రోజూ జిల్లా పరిషత్ కార్యాలయానికి వస్తున్నాను. ఎలాంటి ఫైల్స్ పెండింగ్‌లో ఉంచడం లేదు. అన్ని కార్యకలాపాలు సజావుగానే సాగుతున్నాయి. డిప్యూటీ సీఈవో, సూపరింటెండెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఉన్న సిబ్బందితో కార్యకలాపాలు చేపడుతున్నాం. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బాధ్యతలు సైతం సమర్థంగా నిర్వర్తిస్తున్నాను. ఇక మునిసిపాలిటీ ప్రత్యేకాధికారికి పెద్దగా విధులేమీ లేవు. మునిసిపల్ కమిషనర్‌ను ఎప్పటికప్పుడు సమన్వయ పరుస్తూ ప్రత్యేకాధికారి విధులు చేపడుతున్నాను.

ఆయుష్ ఆస్పత్రిలో ఓపీని ప్రారంభించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆయుష్ ఆస్పత్రిలో ఔట్ పేషెంట్ (ఓపీ) సేవలను ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజీల ప్రిన్సిపాల్, ఆయుష్ ఆస్పత్రి అధికారులతో ఆయన గురువారం సమావేశమయ్యారు. ఆస్పత్రిలో వసతి సౌకర్యం, సిబ్బంది సర్దుబాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయుష్ ఆస్పత్రిలో సేవలు ప్రారంభించాలన్నారు. నర్సింగ్ కాలేజీలకు సిబ్బంది సర్దుబాటు, ఫర్నిచర్ పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. నర్సింగ్ కాలేజీ సీసీ కెమరాలు, మంచినీటి సరఫరాకు ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశం, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఉమా, ఆయుష్ అధికారి తనూజ రాణి, టీజీఎంఎస్ఐడీసీ ఏఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

కాళేశ్వర ముక్తేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో మూడు రోజులపాటు జరిగే మహాకుంభాభిషేకం మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. కాళేశ్వరంలో ఈనెల 7 నుంచి 9 వరకు నిర్వహించే కుంభాభిషేకానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. స్వామి వారి తీర్థ ప్రసాదాల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భద్రతపరమైన చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ పారిశుధ్య ఏర్పాట్లను పటిష్టంగా అమలు చేసేందుకు విధులు కేటాయించినట్లు తెలిపారు. కుంభాభిషేకానికి వచ్చే భక్తులు అధికార యంత్రాంగం సూచనలు పాటించాలని కలెక్టర్ కోరారు.

పంప్‌సెట్లకు సోలార్ విద్యుత్

సర్వే చేసిన అధికారులు



సర్వే చేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది

కాటారం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం గ్రామంలో పీఎం కుసుమ్ (కిసాన్ సురక్ష, ఉద్దాన్ మహా అభియాన్) యోజనలో భాగంగా వ్యవసాయ పంప్‌సెట్లకు సోలార్ విద్యుత్ అందించేందుకు సంబంధిత అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద కాటారం గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక చేయగా ఇటీవల విద్యుత్‌శాఖ అధికారులు ఇళ్ల మీటర్ల సర్వే నిర్వహించగా ప్రస్తుతం వ్యవసాయ బోర్ల సర్వే చేపట్టారు. పొలాల వద్దకు వెళ్లి మోటార్లను పరిశీలించారు. అందుబాటులో లేని కాటారం రెవెన్యూ శివారు రైతులు శుక్రవారం నుంచి సంబంధిత డాక్యుమెంట్లతో సబ్‌స్టేషన్ వద్ద తమను సంప్రదించాలని ఏడీఈ నాగరాజు తెలిపారు. పట్టాదారు, బ్యాంక్ పాస్‌బుక్కులు. ఆధార్, పాన్‌కార్డులు, విద్యుత్ బిల్లు రశీదు, కిసాన్ క్రెడిట్‌కార్డుల జిరాక్స్ కాపీలతో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ సబ్ ఇంజనీర్ చందర్‌రెడ్డి, పలిమెల సబ్‌ఇంజనీర్ కుమార్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, లైన్‌మన్ చంద్రమౌళి, సిబ్బంది ముక్కెర మహేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రెండేళ్లుగా కాలయాపన ఎందుకు?

- జెన్‌కో తరపు న్యాయవాదికి హైకోర్టు సూటీ ప్రశ్న
- భూ నిర్వాసితులకు పునర్వాస ఆలసత్వంపై సీరియస్

మల్హర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ఓపెన్‌కాస్టు తవ్వకాల కోసం పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లోని నివేశన స్థలాలను సేకరించిన అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎందుకు తాత్సారం చేస్తోందని హైకోర్టు జస్టిస్ శ్రీనివాసరావు జెన్‌కో తరపు న్యాయవాదిని ప్రశ్నించారు. ఈ విషయాన్ని భూ నిర్వాసితుల హక్కుల సాధన కమిటీ అధ్యక్షుడు కేశారపు రవి, హైకోర్టు న్యాయవాది పీఎస్ రాజు బుధవారం వెల్లడించారు. తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాసితుల హక్కుల కోసం గతంలో వీరు హైకోర్టును ఆశ్రయించిన విషయం విదితమే. ఈ కేసును హైకోర్టు బెంజ్ గురువారం పరిశీలించింది. 2022లో గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ఇప్పటి వరకు నష్ట పరిహారం చెల్లించకపోవడంపై జెన్ కో తరపు లాయర్‌ను న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రభుత్వం తరఫున న్యాయవాదులను నష్ట పరిహారం చెల్లింపు ఆలస్యం విషయంలో పలు ప్రశ్నలను ఆయన సంధించగా సమాధానం రాలేదు. దీనిపై న్యాయమూర్తి స్పందిస్తూ ప్రజా సమస్యలపై మౌనం వహించడం సరికాదని వ్యాఖ్యానించారు. జెన్‌కో తరఫున కౌంటర్ పిటిషన్ దాఖలు చేయడానికి మూడు వారాల గడువు కావాలని ఈ సందర్భంగా ఆ సంస్థ న్యాయవాది జస్టిస్‌ను కోరారు.

కొండంపల్లి డిక్లరేషన్‌పై గ్రామ సభ



కొండంపల్లిలో మాట్లాడుతున్న సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి

గణపురం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత ప్రాంతమైన కొండంపల్లి గ్రామంలో రెవెన్యూ, సింగరేణి అధికారులు గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఓపెన్‌కాస్టు-3 అతి సమీపంలో ఉన్న కొండంపల్లి తరలింపునకు డిక్లరేషన్ వివరాలను అధికారులు గ్రామస్థులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రవి, సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని గ్రామస్థులకు సూచించారు. గ్రామంలో 41 ఎకరాల 29 గుంటలకు భూసేకరణ తుది ప్రక్రియ ఖరారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, పీవో బిక్షమయ్య, మేనేజర్ శ్రీనివాస్, తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోలీసు క్రీడలు

విజేతగా నిలిచిన భూపాలపల్లి జట్టు



విజేతలకు కప్ అందజేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో ఈ పోటీలు నాలుగు రోజుల పాటు అట్టహాసంగా జరిగాయి. ఈ క్రీడల్లో జిల్లా పోలీసలతో పాటు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొని ఫైనల్ మ్యాచ్ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. క్రికెట్ పోటీల్లో భూపాలపల్లి జట్టు విజయం సాధించింది. మొగుళ్లపల్లి జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ రెండు జట్లకు ప్రథమ, ద్వితీయ నగదు బహుమతులతో పాటు షీల్డులను ఎస్పీ అందించారు. అలాగే, వివిధ విభాగాల్లో సైతం ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి మెమొంటోలు, షీల్డులను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీలు సంపత్‌రావు, రామ్మోహన్‌రెడ్డి, నారాయణ నాయక్, ఇన్‌స్పెక్టర్లు నరేష్‌కుమార్, రామచంద్రరావు, మల్లేష్, వెంకటేశ్వర్‌రావు, నగేష్, కిరణ్, రత్నం, శ్రీకాంత్‌తోపాటు జిల్లా పరిధిలోనీ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



నాగేశ్వర్‌రావు (ఫైల్)

కలకలం రేపిన నిరసన

- గ్రామ సభలో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి
- జనవరి 23న ఆత్మహత్యాయత్నం
- ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స
- బుధవారం రాత్రి ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- కొద్దిసేపటికే ఆరోగ్యం విషమించి మృతి
- కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం : మంత్రి సీతక్క

6



సువర్ణపాక లక్ష్మీనర్సు (ఫైల్)

డ్యూటీకి సెలవు పెట్టి.. ఇంటికి వచ్చి..

- ఆత్మహత్య చేసుకున్న ఏఆర్ ఎస్సై
- అద్దె ఇంట్లో ఉరి వేసుకొని బలవన్మరణం
- కుటుంబ కలహాలే కారణం?

వివరాలు 6వ పేజీలో...

ఇసుక లారీ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడ్డ రవి

కాటారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ ట్రాక్టర్ డ్రైవర్‌ను ఇసుక లారీ ఢీకొంది. కొంత దూరంగా ఈడ్చుకెళ్లింది. దీంతో అతడి తీవ్రంగా గాయపడ్డాడు. రెండు కాళ్లూ నుజ్జునుజ్జు అయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. ఈ సంఘటన కాటారం మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది.

ఎస్సై అభినవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్‌పల్లికి చెందిన తోట రవి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూనే కూలికి వెళ్లంటాడు. ఈ క్రమంలో తన పెద్ద కొడుకును తీసుకుని మండల కేంద్రంలోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్లాడు. పని ముగిసిన తర్వాత రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాన్ని తీసి స్టార్ట్ చేసే సమయంలో మహదేవపూర్ వైపు నుంచి ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనం సహా రవి లారీ కింద ఇరుక్కుపోయాడు. డ్రైవర్ లారీని ఆపకుండా సుమారు 20మీటర్ల వరకు ఈడ్చుకెళ్లాడు. కొంత సమయం తర్వాత రవి లారీ కింద రోడ్డుపై పడ్డాడు. దీంతో రవి రెండు కాళ్లు నుజ్జునుజ్జు అయ్యి తీవ్ర రక్తస్రావమైంది. లారీని స్థానికులు వెంబడించగా మద్దులపల్లి చెక్‌పోస్ట్ వద్ద దొరికింది. డ్రైవర్ వనపర్తి జిల్లా కొత్తకోటపాలెం గ్రామానికి చెందిన ఖానాపురం స్వామిగా తేలింది. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా తీవ్ర రక్తస్రావమై పరిస్థితి విషమంగానే ఉందని అతడి బంధువులు తెలిపారు. బాధితుడి తండ్రి గట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

న్యాయం చేయాలంటూ రాస్తారోకో

ఇసుక లారీ ఢీకొని రెండు కాళ్లు నుజ్జునుజ్జై తీవ్ర రక్తస్రావంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న రవి పరిస్థితిని చూసి మండల కేంద్ర వాసులు, ప్రజాసంఘాలు, బీఆర్ఎస్ నాయకులు చలించిపోయారు. బాధితుడికి న్యాయం చేయాలంటూ రాస్తారోకో చేపట్టారు. ఇసుక లారీలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా మంత్రి శ్రీధర్‌బాబు ఎన్నికల సమయంలో చెప్పినట్లు ప్రభుత్వం రాగానే లారీలను ఎందుకు నిలిపివేయలేదని బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. అరగంటకు పైగా జరిగిన ఈ రాస్తారోకోతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఎస్సై అభినవ్ చొరవతో పరిస్థితి సద్దుమణిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రవి, రాజేంద్రచారి, శ్రావణ్, వంశీ, రాజు, దుర్గారావు, రాజమౌళి, రమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్, డీవైఎఫ్ఐ జిల్లా నేత శ్రీకాంత్, యూవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు బాపు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

మహా వేడుకకు వేళాయె..

- నేడు కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం ప్రారంభం
- 42 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్న అధికారులు

7



కాళేశ్వర ఆలయ గోపురం

మేడారంలో కోలాహలం

30 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు

మినీ జాతరకు ముందు భారీగా మొక్కులు

వివరాలు 6వ పేజీలో..

వివాహితపై సామూహిక అత్యాచారం?!

- జీరో ఎఫ్ఐఆర్ కేసుపై మరిపెడ పోలీసుల విచారణ
- నిందితులు, బాధితురాలు హర్యానా రాష్ట్రవాసులు

మరిపెడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : ఓ వివాహితపై సామూహిక అత్యాచారం జరిగిందని నమోదైన జీరో ఎఫ్ఐఆర్ కేసుపై మహబూబాబాద్ జిల్లా మరిపెడ పోలీసులు విచారణ జరుపుతున్నారు. బుధవారం హర్యానా రాష్ట్రంలోని అల్వాల్ పీఎస్‌లో ఓ మహిళ తనపై భర్త, అతడి స్నేహితులు మరిపెడ ప్రాంతంలో సామూహిక అత్యాచారం చేశారని ఫిర్యాదు చేసింది. అక్కడి పోలీసులు జీరో ఎఫ్ఐర్ నమోదు చేసి మరిపెడ పీఎస్‌కు కేసు ట్రాన్స్‌ఫర్ చేశారు. కేసు టేకాఫ్‌చేసిన మరిపెడ పోలీసులు గురువారం ఆ క్లూస్ కోసం విచారణను వేగవంతం చేశారు. ఎస్సై బోలగాని సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన ఓ వివాహితపై ఆమె భర్త, స్నేహితులతో కలిసి మత్తు మందుఇచ్చి అత్యాచారం చేసి, ఆమెను బెదిరింపులకు గురిచేయగా అక్కడి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ నుంచి ఆమెను మరిపెడ ప్రాంతానికి తీసుకొచ్చి ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోందని, ఆ వివరాల సేకరణ కోసం ప్రత్యేక టీం ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనపై బాధితురాలి నుంచి వివరాలను సేకరిస్తున్నారు. నిందితులు, బాధితురాలు ఇక్కడి వారు కానప్పటికీ మరిపెడతో వీరికి లింకేంటిదో తేల్చే పనిలో మరిపెడ పోలీసులు ఉన్నారు.

భార్యపై డీజిల్ పోసిన భర్త

కేసు నమోదు

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరుమాండ్ల సంకీసకు చెందిన ఓ వ్యక్తి తన భార్యపై డీజిల్ పోసిన ఘటనలో అతడిపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమాండ్ల సంకీసకు చెందిన నీరుడు మహేష్ అదే గ్రామానికి చెందిన శిరీషను ఏడేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తరుచు తన భార్య శిరీషపై అనుమానంతో మహేష్ వేధిస్తుండేవాడు. నాలుగు రోజుల క్రితం ఆమెపై చేయి చేసుకోవడంతో తన పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో బుధవారం కోపోద్రిక్తుడైన మహేష్ అత్తగారింటికి వెళ్లి తన భార్య శిరీషపై డిజిల్‌పోసి నిప్పంటించేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకుని మహేష్‌ను నివారించారు. ఈ విషయంపై శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహేష్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్ గురువారం తెలిపారు.

గుడుంబా కేసులో ఐదుగురి బైండోవర్

తొర్రూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : గుడుంబా తయారీ, రవాణా చేస్తూ పట్టుబడిన ఐదుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి సబ్‌జైలుకు తరలించినట్లు తొర్రూరు ఎక్సైజ్ ఎస్సై రవళిరెడ్డి తెలిపారు. గురువారం ప్రకటనలో ఆమె మాట్లాడుతూ తొర్రూరు ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని నెల్లికుదురు మండలానికి చెందిన ఇమామ్‌బీ, పెరుమాండ్ల చంద్రమ్మ, ఆది వెంకటమ్మ, పెరుమాండ్ల సుజాత, శ్రీరామ్ ఉమ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గుడుంబా తయారు చేస్తూ విక్రయా లు చేస్తుండడంతో వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా, కేసులు నమోదు చేసి సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. గుడుంబా విక్రయాలు చేసినా, నల్లబెల్లం రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

గూడూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడూరు, మచ్చర్ల, అప్పరాజుపల్లి గ్రామాల్లో ఉన్న ఎరువులు దుకాణాలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయనిర్మల గురువారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఎరువుల దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్‌లు పరిశీలించారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ-పాస్ మిషన్ ద్వారానే ఎరువులను విక్రయించాలని, లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు, పురుగుమందులు, ఎరువులను విక్రయించాలని రైతులకు సూచించారు. మర్రిమిట్టలో డిజిటల్ క్రాప్ సర్వేను పరిశీలించారు. హైదరాబాద్‌లో ఈ నెల 7 నుంచి 9 వరకు కిసాన్ అగ్రిషో ఉంటుందని ఆసక్తి కలిగిన రైతులు ఎవరైన ఉంటే వెళ్ల వచ్చని చెప్పారు. ఆమె వెంట మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్, ఏఈవోలు పాల్గొన్నారు.

బంజారాల కల్చరల్ మీట్ అదరహో

- ఉట్టిపడిన గిరిజన సంస్కృతీ, సంప్రదాయాలు
- తీజ్, సీత్లా పండుగలపై అవగాహన
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

మరిపెడ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఇండోర్ స్టేడియం కం ఆడిటోరియంలో గురువారం తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన బంజారాల కల్చరల్ స్టేట్‌మీట్ అదిరిపోయింది. ఈ హాజరైన గిరిజన ఉద్యోగులు, విద్యార్థులు వారివారి వేషధారణలతో బంజారాల సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా చేశారు. తీజ్, సీత్లా పండుగ వేడుకలు గిరిజనుల ఆచార వ్యవహారాలు, వంటలపై విద్యార్థులకు అవగాహన కలిగేలా వేడుకలను నిర్వహించారు. పభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలోని నాలుగుచోట్ల తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యాన బంజారాల కల్చరల్ మీట్‌ను గురువారం నిర్వహించగా, దానిలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి కింద మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్ కేంద్రంలో స్థానిక సీతారాంపూర్ హైస్కూల్ హెచ్‌ఎం, టీచర్ల పర్యవేక్షణలో ఈ వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. బంజారాల ప్రతీ పండుగ విశిష్టతలను కళ్లకు కట్టినట్లు చూపించారు. ఆచార వ్యవహారాలు, వస్త్రధారణ ఆకట్టుకున్నాయి. వారి ఆహారపు అలవాట్లపై వంటకాలు చేసి అదరహో అనిపించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక పాఠశాలల విద్యార్థులు, ఉద్యోగులు ఈ వేడుకలకు హాజరై బంజారాల నైపుణ్యతను ప్రదర్శించారు. విద్యారులకు వారి సంప్రదాయ ఆట పాటలతో పాటు క్రాఫ్ట్‌పోటీలు నిర్వహించారు.

ఈ పోటీలలో జడ్పీహెచ్‌ఎస్ సీతారాంపురం, కేజీబీవీ మరిపెడ, తొర్రూరు, కొత్తగూడ, సెయింట్ ఆగస్టీన్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారికి డీఈవో రవీందర్‌రెడ్డి మెమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో స్టేట్ జెండర్ కోఆర్డినేటర్ శిరీష, జిల్లా జెండర్ కో-ఆర్డీనేటర్ విజయకుమారి, జిల్లా సైన్స్ ఆఫీసర్ అప్పారావు, మరిపెడ తహసీల్దార్ సైదులు, ఎంఈవో అనితదేవి, సీతారాంపూర్ హైస్కూల్ హెచ్‌ఎం రాంచంద్రయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పూర్వపు ఆచారాలు అంతరించొద్దు

బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను రేపటితరానికి అందించే బాధ్యత ఆ జాతీ విద్యార్థులు, యువత, ఉద్యోగుల దేనని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవీందర్‌రెడ్డి అన్నారు. మరిపెడలో జరిగిన బంజారాల కల్చరల్ మీట్ ముగింపు సమావేశానికి ఆయన హాజరై, విజేతలకు బహుమతులను అందజేసి మాట్లాడారు. రెండు రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మరిపెడ మునిసిపల్ కేంద్రంలో ఈ మీట్ విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందిం చారు. ఈ సందర్భంగా బంజారాలను ఉద్దేశించి మాట్లాడారు. నేటి హైటెక్ యుగంలో పూర్వపు ఆచారాలు, వ్యవహారాలను అంతరించొద్దని తెలంగాణ ప్రభుత్వం బంజారాల కల్చరల్ మీట్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. విద్యార్థులకు బంజారాల పండుగలు, ఆహారపు అలవాట్లపై అవగాహన కలిపించడంపై సంతోషం వ్యక్తం చేశారు.


తీజ్ వేడుకలను నిర్వహిస్తున్న బంజారా విద్యార్థులు, ఉద్యోగులు


బంజారాల నృత్యం చేస్తున్న విద్యార్థులు

మేడారంలో భక్తుల కోలాహలం

30 వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు


వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో గురువారం సందడి నెలకొంది. మినీ జాతరను పురస్కరించుకొని భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వనదేవతలకు దర్శించుకున్నారు. దీంతో ఆ పరిసరాలన్నీ కోలాహలంగా మారాయి. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరగనున్న మినీ జాతరకు మరో ఐదు రోజుల సమయం ఉండటంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ముందుగా జంపన్నవాగులోని స్నానఘట్టాల వద్ద బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. అనంతరం డోలు వాయిద్యాల నడుమ శివసత్తుల పూనకాలతో సమ్మక్క, సారలమ్మలకు జేజేలు పలుకుతూ అమ్మవార్ల గద్దెల వద్దకు ఎత్తు బంగారంతో చేరుకున్నారు. కోరికలు తీర్చాలని వేడుకున్నారు. అలాగే పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారె కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు వచ్చినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

డిజిటల్ క్రాప్ సర్వేతో కచ్చితమైన పంటల నమోదు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ క్రాప్ సర్వేద్వారా కచ్చితమైన పంటల నమోదు, రైతుల వివరాలు తెలుస్తాయని మహబూబాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకుడు అజ్మీరా శ్రీనివాసరావు అన్నారు. ముడుపుగల్, శనిగపురం గ్రామాల్లో వ్యవసాయశాఖ చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పక్కాగా పంటలను నమోదు చేసేందుకు డిజిటల్ క్రాప్‌సర్వే చేయడం జరుగుతుందని, క్షేత్రస్థాయిలో పంట పొలాలను 25 మీటర్ల దూరంలో ఉండి ఫొటోలు తీసి డిజిటల్ క్రాప్ సర్వే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. రెవెన్యూ గ్రామం, సర్వే నెంబర్ల భూముల హద్దులతో కూడిన యాప్‌లను ధరణి పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని క్షేత్రస్థాయిలో పంట పొలాలను డిజిటల్ క్రాస్‌సర్వేలో నమోదు చేయాలని చెప్పారు. ప్రతీ సర్వే నెంబర్‌ను పక్కాగా నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. దీనివల్ల పంటల నమోదు కచ్చితమైన సమాచారం తెలుస్తుందని చెప్పారు. ఏవో ఎన్.తిరుపతిరెడ్డి, ఏఈవో సాయిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2280	2100
పల్లికాయ (సూక)	6350	4600
పల్లికాయ (పచ్చి)	4300	3100
కందులు	6782	5540
పెసళ్లు	-	-
పత్తి	6970	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	-	-
ఎల్లో మిర్చి	18000	13500
తేజ మిర్చి	13400	9000
తేజ ఏసీ	16500	14000
వండర్‌హాట్	15000	11500
యూఎస్341ఏసీ	14100	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టీ ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

జయపురంలో దళితులు ఆలయ దర్శనం

కుల వివక్షపై స్పందించిన అధికారులు

నర్సింహులపేట (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జయపురంలో దళితుల పట్ల అగ్ర కులస్తుల వివక్ష, ఆలయానికి రంగులు వేయరాదంటూ గురువారం పత్రికల్లో వచ్చిన కథనాలకు తహసీల్దార్ సీహెచ్.నాగరాజు, ఎస్సై ఎం.సురేష్ స్పందించారు. సిబ్బందితో జయపురం గ్రామం సందర్శించి, కుల వివక్ష నేరమని ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కులాలకతీతంగా గ్రామస్థులతో కలిసి స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ దర్శనం చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్, ఎస్సై మాట్లాడుతూ కుల వివక్షతో ఏ సామాజిక వర్గాన్ని దూషించినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కులాలకతీతంగా ప్రజలు సోదరభావంతో ఉండాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తే కటకటాల పాలు కాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావరి అఖిల్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.


జయపురం గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అధికారులు, దళితులు

డ్యూటీకి సెలవు పెట్టి.. ఇంటికి వచ్చి..

- ఆత్మహత్య చేసుకున్న ఏఆర్ ఎస్సై
- అద్దె ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణం
- కుటుంబ కలహాలే కారణం ?


లక్ష్మీనర్సు (ఫైల్)

గోవిందరావుపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి నుంచి కాస్త ఉపశమనం పొందాలనుకొని డ్యూటీకి సెలవు పెట్టి ఇంటికి వచ్చిన ఏఆర్ ఎస్సై ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని నింపింది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గోవిందరావుపేట మండలంలోని పస్రాలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న ఏఆర్ ఎస్సై సువర్ణపాక లక్ష్మీనర్సు(38) గురువారం ఉదయం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన ఆయన 2007లో ఏఆర్ ఎస్సైగా ఉద్యోగంలో చేరారు.

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని టీజీఎస్పీ-15వ బెటాలియన్‌కు చెందిన ఆయన ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో టీజీ స్పెషల్ పార్టీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్సై కొనసాగుతున్నారు. భార్య వినోద తాడ్వాయి మండలం మేడారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. కొంతకా లంగా తమ ఇద్దరు పిల్లలు తనుశ్రీ, యోగితో కలిసి పస్రాలోని అద్దె ఇంట్లో ఆమె నివసిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన లక్ష్మీనర్సు గురువారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష్మీనర్సు ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణమని తెలుస్తోంది. భార్యాపిల్లలు, కుటుంబ సభ్యులు ఆయన మృతదేహంపై పడి కన్నీరుమున్నీరుగా విలపించారు. లక్ష్మీనర్సు మృతదేహానికి ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం జరిపించిన పస్రా పోలీసులు ఆయన తండ్రి ధర్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కలకలం రేపిన నిరసన

- గ్రామసభలో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి
- జనవరి 23న ఆత్మహత్యాయత్నం
- ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స
- బుధవారం రాత్రి ఎంజీఎం ఆస్పత్రికి తరలింపు
- కొద్దిసేపటికే ఆరోగ్యం విషమించి మృతి
- కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం : మంత్రి సీతక్క

ములుగు/కన్నాయిగూడెం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జనవరిలో జరిగిన ఘటన కలకలానికి దారి తీసింది. ప్రజాపాలన గ్రామసభలో అందరూ చూస్తుండగా ఓ వ్యక్తి పురుగుల మందు తాగడం, చికిత్స పొందుతూ మృతి చెందడం చర్చనీయాంశమైంది. దీనిపై రాజకీయ ఆరోపణ, ప్రత్యారోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి.

గ్రామ సభకు వచ్చి..

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల పథకాల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో జనవరి 23న గ్రామ సభ జరిగింది. ఈ పంచాయతీ పరిధి కొత్తూరుకు చెందిన కుమ్మరి నాగేశ్వర్‌రావు (42) అప్పటికే ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకొని ఉన్నాడు. గ్రామ సభకు హాజరైన అయన లబ్ధిదారుల జాబితాలో తన పేరు లేకపోవడంతో అధికారులను నిలదీశాడు. దీంతో స్పందించిన అధికారులు మళ్లీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని వివరణ ఇస్తుండగానే తీవ్ర మనస్తాపానికి గురైన నాగేశ్వర్‌రావు వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగాడు. పక్కనే ఉన్నవారు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. అస్వస్థతకు గురైన నాగేశ్వరరావును 108 అంబులెన్స్‌లో తొలుత ఏటూరునాగారం ప్రభుత్వ సామాజిక వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచన మేరకు ములుగు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హనుమకొండ జిల్లా ఆరెపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఈ సంఘటనకు సంబంధించి కన్నాయిగూడెం తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో అనిత అదే రోజున ఓ ప్రకటన విడుదల చేశారు. నాగేశ్వర్‌రావు భార్య శాంతి బుట్టాయిగూడెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తోందని, ఆ కుటుంబానికి వ్యవసాయ భూమి కూడా ఉందని తెలిపారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉంటే లబ్ధి చేకూర్చుతామని చెప్పినా ఆయన క్షణికావేశంలో పురుగులమందు తాగాడని పేర్కొన్నారు. గ్రామ సభను తప్పుదోవ పట్టించేందుకు ఈ చర్యకు పాల్పడ్డాడని అభిప్రాయపడ్డారు. ఇదే క్రమంలో ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారంతో కలెక్టర్ హెల్త్ బులిటెన్ కూడా విడుదల చేశారు.

ప్రైవేటు ఆస్పత్రి నుంచి ఎంజీఎంకు..

ఆత్మహత్యాయత్నం చేసిన నాగేశ్వర్‌రావు ఆరెపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండానే ఆయన్ను బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలోనే ఆయన ఆరోగ్యం విషమించి అదే రోజు అర్ధరాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వేణుగోపాల్ గురువారం ఎంజీఎంకు వెళ్లారు. అంత్యక్రియల నిమిత్తం రూ.50వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించిన కుటుంబ సభ్యులు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. నాగేశ్వర్‌రావుకు భార్య శాంతి, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వైద్యానికి ఇప్పటి వరకు రూ.8లక్షల 50వేల వరకు ఖర్చయ్యిందని, తాము సొంతంగా రూ.3లక్షల 50వేలు సమకూర్చుకోగా మిగతా మొత్తాన్ని రాజకీయ నాయకులు, సన్నిహితులు సాయంగా అందించారని నాగేశ్వర్‌రావు పెద్దకుమార్తె శాలిని తెలిపింది. వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతోనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని చెప్పింది. తాము పెద్దదిక్కును కోల్పోయామని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఇల్లును మంజూరు చేయా లని ఆమె ప్రభుత్వాన్ని కోరింది.


నాగేశ్వర్‌రావు (ఫైల్)


కుమ్మరి నాగేశ్వర్‌రావు మృతదేహం

విచారం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

నాగేశ్వర్‌రావు మృతి పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఓ ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. నాగేశ్వర్‌రావుకు అందుతున్న వైద్య సేవల గురించి డీసీసీ అధ్యక్షుడు అశోక్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రైవేటు ఆస్పత్రి యాజమా న్యంతో మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించేలా చొరవ తీసుకుంటూనే ఉన్నామని తెలిపారు. కానీ, ఉన్నపళంగా ఎంజీఎం ఆస్పత్రికి ఎందుకు తీసుకెళ్లాల్సి వచ్చిందని మంత్రి ప్రశ్నించారు.

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం

గ్రామ సభలో నాగేశ్వరరావు పురుగుల మందు తాగిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శమని విపక్షాలు ఆరోపించాయి. ప్రజాప్రభుత్వాన్ని అభాసుపాలు చేసేందు కోసం బీఆర్ఎస్ నాయకులు కుట్ర చేశారని, నాగేశ్వర్‌రావుకు మద్యం తాగించి ఆత్మహత్యకు ప్రేరేపించారని మంత్రి సీతక్క తీవ్ర ఆరోపణలు చేశారు. నాగేశ్వరరావు భార్య శాంతికి తానే అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం ఇప్పించానని తెలిపారు. జనవరి 26వ తేదీ రాత్రి ఆయన చికిత్సపొందుతున్న ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లిన సీతక్క పరామర్శించారు. ఈవిషయమై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు ఓ ప్రకటన జారీ చేశారు. నాగేశ్వనరావుది ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.


జనవరి 26న ఆస్పత్రిలో డాక్టర్లతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సంగీత సాగరం.. నటరాజ కేతనం

విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలకు 52 ఏళ్లు

- ఎందరినో ప్రతిభావంతులైన కళాకారులుగా తీర్చిదిద్దిన సంస్థ
- మహామహులైన అధ్యాపకులతో శిక్షణ
- నేడు కాళోజీ కళాక్షేత్రంలో స్వర్ణోత్సవ సంబురం

హనుమకొండ కల్చరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాశ్చాత్య ఆధునిక నృత్యాల హోరులో మసకబారుతున్న భారతీయ సంగీత నృత్య రీతులకు అక్కడ ప్రాణం పోస్తారు. యాంత్రిక జీవనంలోనూ సంగీత కళలంటే, శాస్త్రీయ నృత్యాలంటే మక్కువ చూపేవారికి అక్కడ తరగని ప్రోత్సాహం ఇస్తారు. ఆశించిన సౌకర్యాలు లేనప్పటికీ సంకల్పమే మహాబలంగా అక్కడ సంగీతం వీనులవిందు చేస్తుంది. నృత్య సవ్వడులు తనువును పులకింపజేస్తాయి. నగరంలోని పోతన ఆడిటోరియం వద్ద కొలువుదీరిన విద్యారణ్య ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల చారిత్రక ఓరుగల్లు కంఠ భరణంగా విలసిల్లుతోంది. ఎందరో కళాకారులను తీర్చిదిద్ది భారతీయతకు పట్టం కడుతోంది. మహామహులైన అధ్యాపకులను ముంగిటకు తెచ్చి సంగీత పరిమళాలను వెదజల్లుతోంది. ఈ కళాశాల స్థాపించి 52 వసంతాలు పూర్తవుతున్నాయి. ఈ సందర్భంగా కళాశాల సంగీత నృత్య ప్రస్థానంపై అవలోకనం.

ప్రస్థానం

1972వ సంవత్సరంలో ఓరుగల్లు నగరంలో రాష్ట్ర సాంస్కృతికశాఖ ఈ పాఠశాలను ప్రారంభించింది. కేవలం కర్ణాటక గాత్రం, హిందుస్థానీ గాత్రం కోర్సులతో ప్రారంభమైన పాఠశాల.. తరువాత అప్‌గ్రేడ్ అయి దాదాపు అన్ని ప్రధాన కోర్సులతో నేడు యేటా 350మందికి పైగా విద్యార్థులతో విద్యారణ్య ప్రభుత్వ నృత్య కళాశాలగా ఆదరణ పొందుతోంది. గతంలో ఈ కళాశాలలో పని చేసిన పని చేసిన వారు ప్రముఖంగా పేరుగాంచిన వారే కావడం విశేషం. కళాశాల తొలి ప్రిన్సిపాల్ ఆకెళ్ల మల్లికార్జునశర్మతో ప్రారంభమై ఎన్.హన్మంతరావు, పూచర్ల మనోరమ, పివి.శేషయ్యశాస్త్రి, సుబ్బరాయశర్మ, గుమ్మడి జనార్దన్, జె.శ్రీనివాసమూర్తి, కుప్ప పద్మజతోపాటు ప్రస్తుత ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ లాంటి ప్రసిద్ధ కళాకారులే కళాశాల ప్రిన్సిపాళ్లుగా పని చేశారు. ఇప్పటి వరకు వివిధ కోర్సుల్లో ఈ కళాశాలలో 13వేల పైచిలుకు విద్యార్థులు సంగీత నృత్య విద్యలను అభ్యసించారు. యేటా కొత్తగా 350 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. కర్ణాటక గాత్రం, వయోలిన్, కూచిపూడి నృత్యం, హిందుస్థానీ గాత్రం, వీణ, మృదంగం, సితార్, తబలా లాంటి కోర్సులతోపాటు ఓరుగల్లులో పురుడుపోసుకున్న పేరిణి నృత్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాల ద్వారా యేటా జనవరి 30న సద్గురు త్యాగరాయ స్వామి ఆరాధనోత్సవాలు, సంగీత దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలతోపాటు నెల నెలా వెన్నెల పేరిట క్రమం తప్పకుండా కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. సంగీత నృత్యాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తూ ఆదరణ పొందుతున్న తమ ఈ కళాశాలకు అన్ని హంగులతో సొంత భవనం ఒకటి ప్రత్యేకంగా ఉంటే మరింత శిక్షణ ఇచ్చి కలల నగరంలో మరింతగా కళాకారులను తీర్చిదిద్దే అవకాశాలు మెండుగా ఉంటాయి.

కళాక్షేత్రంలో..

కరోనా కారణంగా రెండేళ్ల కిందటే జరుపుకోవాల్సిన స్వర్ణోత్సవ వేడుకలను ఈ నెల 7వ తేదీన హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున జరుపుకునేందుకు సమాయత్తం కావడం విశేషం. సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగే స్వర్ణోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, రాష్ట్ర సాంస్కృతిక భాషా సంచాలకులు మామిడి హరికృష్ణ, ప్రత్యేక ఆహ్వానితులుగా భద్రకాళి ఆలయ చైర్మన్ బి.శేషగిరిరావు తదితరులు పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సుధీర్ కుమార్ చెప్పారు. కళాశాల స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా ఈ కళాశాలలో పనిచేసిన అధ్యాపకులను సత్కరించడంతోపాటు విభిన్న కోర్సులలో శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయస్థాయిల్లో పేరుగడించిన తమ విద్యార్థులచే ప్రతిభా ప్రదర్శనలు నిర్వహించనున్నారు.




హిందుస్థానీ గాత్ర కచేరి


కూచిపూడి నాట్యం చేస్తున్న కళాకారులు


వయోలిన్ కచేరి


కర్ణాటక గాత్ర కచేరి


పేరిణి నృత్యం

ఈ-బైక్ జోరు.. అమ్మకాల్లో హుషారు!

రోజురోజుకూ పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు పెరుగుతున్న పెట్రోల్ ధరలు.. మరోవైపు పొగ కాలుష్యం.. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని పరిరక్షిస్తూనే.. జనం తమ ఖర్చును తగ్గించుకోవడంపై దృష్టిపెడుతున్నారు. ఈ క్రమంలో పెట్రోల్‌తో నడిచే ద్విచక్రవాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ బైక్‌లను కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం పేద, మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ధరల్లో ఎలక్ట్రిక్ వాహనాలు వస్తుండటంతో వీటి విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని డీలర్లు చెబుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల సమస్యను అధిగమిం చడం సగటు మానవులకు కత్తిమీద సాములా మారిన నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నట్టు ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను బట్టి అర్థమవుతోంది. విద్యుత్ వాహనాలపై రోడ్డు ట్యాక్స్, రిజిస్ట్రేషన్ చార్జీలను పూర్తిస్థాయిలో మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వాహనదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. అ మేరకు న్యూ ఈవీ పాలసీ ఉత్తర్వుల్లో జీవో 41 కూడా జారీ చేసింది.

మారుతున్న ట్రెండ్

ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో ఏ కొద్ది దూరం వెళ్లాలన్నా బైక్ తప్పనిసరి అయిపో యింది. ఈ క్రమంలోనే వాహనదారులంతా తమ పాత వాహనాల స్థానంలో విద్యుత్‌తో నడిచే స్కూటీలు, బైక్‌లు, ఇతర వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగ, ఉపాధి, వాణిజ్య అవసరాలు కలిగిన వారంతా ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఆ వాహనాల సంఖ్య జిల్లాలో గణనీయంగా పెరుగుతోంది. మరో వైపు పెరుగుతున్న వాహన కాలుష్యం రీత్యా ఎలక్ట్రిక్ వాహనాలకు తగిన ప్రోత్సాహంతో కూడిన మినహాయింపులు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశాలున్నాయి. వీటి కోసం తగినన్ని చార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు కూడా అవసరమని వాహనదారులు పేర్కొంటున్నారు. కంపెనీలు, మోడళ్లు, సామర్థ్యా న్ని బట్టి రూ.60వేల నుంచి రూ.2లక్షల వరకు ధరల్లో ఈ బైక్‌లు లభ్యమవుతున్నాయి. ఎలక్ట్రికల్ వాహనాల్లో 250 వాట్ల కంటే తక్కువ శక్తిని కలిగి ఉండి గంటకు 25 కిలో మీటర్ల కంటే తక్కువ వేగం కలిగిన సామర్థ్యం ఉన్న వాహనాలకు ఎలాంటి రిజిస్ట్రేషన్ అవసరం లేదు. అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్నవాటిని మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉండేది.



తాజాగా విద్యుత్‌తో నడిచే అన్ని వాహనాలకు కూడా పూర్తిస్థాయి రిజిస్ట్రేషన్ చార్జీలు, రోడ్డు ట్యాక్ రద్దు చేయడంతో వీటి కొనుగోలు మరింత పెరిగే అవకాశం ఉందని వాహన అమ్మకందారులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

పేద, మధ్య తరగతి కుటుంబాలకు లాభదాయకం
గజ్జెల రమేష్, ఎలక్ట్రిక్ బైక్ షోరూం డీలర్



డీలర్

గతంలో పెట్రోల్ బైక్‌లు నడిపి ఇబ్బందుల పాలవుతున్న వారు మమ్మల్ని సంప్రదించి వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఈ ఎలక్ట్రిక్ బైక్‌లు ఎంతో లాభదాయకం. రైతులు, చిరు వ్యాపారం చేసుకునే వారికి సైతం అనువుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తక్కు వ ఖర్చుతో ఎక్కువ లాభప డేందుకు ప్రజలు ముందుకు వస్తున్నారు. గంట చార్జింగ్ పెడితే కొందరికి రెండు మూడు రోజుల పాటు వస్తోంది. దీనికి తోడు పర్యావరణ పరిరక్షణ కూడా వీలవుతుంది.

మహా వేడుకకు వేళాయే..

- నేడు కాళేశ్వరంలో మహా కుంభాభిషేకం ప్రారంభం
- 42 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాక
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్న అధికారులు

మహదేవపూర్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం. దక్షిణ కాశీగా పేరొందిన శైవక్షేత్రం ఇది. గోదావరి, ప్రాణహిత, సరస్వతి ఒడ్డున ఒకే పానవట్టంపై వెలిసిన రెండు లింగాలు ఉండి భక్తుల కొంగుబంగారంగా విలసిల్లుతోంది. ఇక్కడ కుంభాభిషేక ఉత్సవాలు 42 ఏళ్ల అనంతరం శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. దీని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్‌శర్మ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొననున్నారు. శుక్రవారం (ఈనెల 7న) స్వస్తి క్రోధి నామ సంవత్సర మాఘ శుద్ధ దశమి సందర్భంగా కుంభాభిషేకం ప్రారంభం కానుంది. ఈనెల 9 వరకు ఈ క్రతువు జరగనుంది.

వేడుకలు ఇలా..

కుంభాభిషేకం సందర్భంగా సప్త నదీ జలాలతో 1008 కళశాలతో వేద పండితులు మహా ఘట్టాన్ని నిర్వహించనున్నారు. విశ్వ కల్యాణం కోసం శృంగేరి జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి ఆశీస్సులతో విధుశేఖర భారతి తీర్థస్వామి అనుగ్రహం, తుని తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి కరకములతో శతచండీ మహారుద్ర సహిత సహస్ర ఘటాభిషేకం, కుంభాభిషేకం మహోత్సవ ప్రయాగ దీక్ష జరుపనున్నట్లు వేద పండితులు తెలిపారు. సప్తనది జలాలతో కుంభాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.


విద్యుత్ దీపాలతో అలంకరించిన కుంభాభిషేక మండపం

50 మంది వేద పండితులు

పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో 42 సంవత్సరాల తర్వాత జరిగే మహా కుంభాభిషేకానికి ఆలయ అర్చకులతో పాటు 50 మంది వేద పండితులు పాల్గొననున్నారు. మంచిర్యాల జిల్లా అర్చనాపురం గ్రామానికి చెందిన 50 మంది వేద పండితులు కుంభాభిషేకంలో పాల్గొననున్నారు.

100 మంది సిబ్బందితో సేవలు

కుంభాభిషేక మహా ఘట్టానికి పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, ఆర్ అండ్‌బీ, అగ్నిమాపక, హెల్త్, ఇరిగేషన్, ఇతర విభాగాల అధికారులు మొత్తం వంద మంది సేవలు అందించనున్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే నేతృత్వంలో పోలీసులు కుంభాభిషేకంలో మూడు రోజులపాటు భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 200 మంది ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొననున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఎస్పీ అన్ని ఘాట్లను పరిశీలించారు. ఎప్పటికప్పుడు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. మూడు రోజుల పాటు కుంభాభిషేకానికి వచ్చే వీఐపీలు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

భక్తులకు ఆర్టీసీ సేవలు

కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు ఆర్టీసీ అధికారులు నడుపనున్నారు. భూపాలపల్లి, వరంగల్, జనగామ, మంచిర్యాల, మంథని, గోదావరిఖని, ఆసీఫాబాద్, కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడతో పాటు పలు డిపోల నుంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వీసులను అందించనున్నట్లు అధికారులు తెలిపారు.


కాళేశ్వరాలయంలో కుంభాభిషేకానికి సిద్ధంగా ఉన్న కళశాలు

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : ఈవో మహేష్

కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో జరిగే మహా కుంభాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ వేడుకలు అంగరంగ వైభవంతో నిర్వహిస్తున్నాం. నాలుగు గోపురాలకు పరంజాలు కట్టాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పనులు పూర్తి చేశాం.

లోకల్ కౌబాయ్.. భలే చాయ్

- ఆహార్యంలో అతడిదో ప్రత్యేకత
- రోజుకు 20 కిలోమీటర్లు నడుస్తూ టీ విక్రయం
- ఫోన్‌లో ఆర్డర్ చేస్తే చాలు నిమిషాల్లో అక్కడకు..
- ఆకట్టుకుంటున్న 'ఓరుగల్లు జేమ్స్‌బాండ్' రావల్



వరంగల్ కార్పొరేషన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): అతడి అందరూ లోకల్ కౌ బాయ్ అని పిలుస్తుంటారు. జేమ్స్‌బాండ్‌లా ఉన్నావ్.. అంటూ కితాబిస్తుంటారు. అందరూ అన్నట్టుగానే ఆరడుగుల ఎత్తు.. బక్కపలచని శరీరాకృతి.. నెత్తిన గుండ్రటి టోపీ ధరించి అందరినీ ఆకట్టుకునేలా ఉంటాడు.. ఇంతకీ ఎవరా అతడు అనుకుంటున్నారా? అతడు ఒక సాధారణ చాయ్ వాలా. వరంగల్ నగరంలో షాపింగ్ మాల్స్, షాపులు, జంక్షన్లు, సెంటర్లలో సంచరిస్తూ టీవిక్రయించే కేపీ రావల్ అలియాస్ కన్నయ్య ప్రతాప్ లాల్. చాయ్‌వాలా అయినప్పటికీ రావల్ ఓ ప్రత్యేకతను చాటుకుంటున్నాడు. చూడటానికి సినిమా హీరోలా, గొప్పింటి బిడ్డలా కనిపిస్తున్న రావల్.. రెండు చేతుల్లో టీ ఫ్లాస్కులు, గ్లాసుల కట్టలు పట్టుకుని.. నడుము చుట్టూ క్యాష్ బ్యాగ్ ధరించి, నెత్తిన కౌబాయ్ క్యాప్, మెడలో పూసల దండలు, చేతులకు వివిధ రకాల బ్రాస్‌లెట్, దారాలు కట్టుకుని అందరి చూపును తన వైపునకు తిప్పుకుంటున్నాడు. కనిపించిన ప్రతీ ఒక్కరిని 'హాయ్ సార్.. హాయ్ మేడం.. చాయ్ కావాలా?' అంటూ నవ్వుతూ పలకరిస్తాడు. వరంగల్, హనుమకొండ నగరాల్లోని ప్రధాన రోడ్లపై నడుస్తూ 'హే భాయ్.. ఇదర్ చాయ్..' అంటూ స్టైల్ ఇస్తాడు. పలు ప్రాంతాల్లో తిరుగుతూ అమ్మే అతడికి ఆయా ప్రాంతాల్లో షాపింగ్ మాల్స్, ఇతర దుకాణాల నుంచి రోజూ సుమారు 200 మందికిపైగా ఫోన్ కాల్స్ చేసి టీ తెప్పించుకుంటారు. వారు ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకుని టీ అందిస్తాడు. ఎవరైనా ఏంటీ ఈ వేషం అని అడిగితే.. ఫ్యాషన్ అని, ఫేమస్ కావాలనే ఇలా ఉంటానని, అందరికంటే బిన్నంగా ఉండడమే నా ప్రత్యేకత అని సమాధానమిస్తాడు హనుమకొండ చౌరస్తా, పెట్రోల్‌పంపు, ములుగురోడ్డు, ఎంజీఎం, కాజీపేట, కేయూ జంక్షన్, బాలసముద్రం, నక్కలగుట్ట వరకు రోజుకు సుమారు 20 నుంచి 30 కిలోమీటర్లు నడుస్తూ.. టీ అమ్ముతాడు. 8నుంచి 10 ఫ్లాస్కుల చాయ్, కాఫీలను విక్రయిస్తూ రోజుకు రూ.600 నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్నాడు. ఇక తన ఫిట్‌నెస్ కోసం ఎలాంటి వ్యాయామం చేయనని, రోజూ తాను నడిచేదే సరిపోతుందని, అదే తన ఆరోగ్య రహస్యమని చెబుతున్నాడు.

గుజరాత్ నుంచి వరంగల్‌కు..

వరంగల్ వెరీ ఫేమస్ చాయ్ వాలాగా పేరున్న కేపీ రావల్ స్వస్థలం గుజరాత్ రాష్టంలోని గాంధీనగర్ ప్రాంతం. జీవనాధారం కోసం అతడి కుటుంబం 2010లో వరంగల్‌కు వచ్చింది. అప్పటికే భార్య మీనాక్షి, ఇద్దరు కుమారులు అల్కార్ రావల్, మోహిత్ రావల్ ఉన్నారు. తొలిరోజుల్లో కాజీపేట ఫాతిమానగర్ జంక్షన్‌లో రూ.5లక్షలతో శ్రీరాం మార్వాడీ భోజనశాలను ఏర్పాటు చేశాడు. కానీ వ్యాపారం అంతగా లేక నష్టం రావడంతో అక్కడి నుంచి హనుమకొండకు మకాం మార్చాడు. రెడ్డికాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉన్న కాస్త డబ్బులతో ఇంట్లోనే బార్య చేసిన చాయ్‌ని రెండు ఫ్లాస్కులలో నింపుకుని రోడ్డెక్కాడు. నాడు రూ.2కే చాయ్ అమ్మగా.. బేరం సక్సెస్‌ఫుల్‌గా నడవడం, భార్య సహకారంతో అదే ప్రాంతంలో ఓ ఇంటిని కూడా కొనుక్కోగలిగాడు. అయినా చాయ్ విక్రయమే జీవనాధారంగా చేసుకుని.. ప్రస్తుతం ఒక్కో టీ, కాఫీ రూ.10కి అమ్ముతున్నాడు. ఇక తన పెద్ద కుమారుడు అల్కార్ రావల్‌కు పెట్రోల్ పంపు సమీపంలో ఓ హోటల్ పెట్టించగా.. చిన్న కుమారుడు మోహిత్ రావల్ ఢిల్లీలో సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు.

సంపాదనలో కొంత సామాజిక సేవకు..

రోజూ టీ విక్రయించగా వచ్చిన డబ్బులో కొంత సామాజిక సేవా కార్యక్రమాలకు కూడా వెచ్చిస్తున్నాడు రావల్. కుటుంబ సభ్యుల పుట్టిన, పెళ్లిరోజు వేడుకల సందర్భంగా దైవకార్యాలకు ఆర్థిక సాయం చేయడంతో పాటు నగరంలో రాత్రి సమయంలో రోడ్లపై నిద్రించే నిరాశ్రయులకు అన్నం, దుప్పట్లు పంపిణీ చేస్తాడు. మానసిక వికలాంగులు, వృద్ధాశ్రమాల్లో అన్నదాన కార్యక్రమాలు చేస్తుంటాడు. తనకు వచ్చే చిన్నపాటి ఆదాయం నుంచి ఆపదలో ఉన్న పేదలకు పంచడం తనకు సంతోషాన్నిస్తోందని, ప్రతీ మనిషికి కష్టాలు.. నష్టాలు ఉంటూనే ఉంటాయని, అందరికీ ఆనందం పంచడమంటే తనకు ఇష్టమని రావల్ చెబుతున్నాడు. ఇదంతా తాను సొంతగా పెట్టుకున్న యూట్యూబ్ చానల్ ద్వారా యువతకు చెబుతున్నానని, ఇప్పటి వరకు తన చానల్‌కు 10వేల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారని, తాను రీల్స్ చేయడం ఆలస్యం చేస్తే తన అభిమానులు ఫోన్లు చేసి మరీ అడుగుతారన్నారు. తన వేషధారణ చూసి ప్రతి ఒక్కరూ తనను ఇష్టపడతారని, కొందరు చాయ్ కోసం ఫోన్‌లో ఆర్డర్ ఇస్తారని చెప్పాడు. తనకు చిన్నతనం నుంచే సినిమాలు అంటే చాలా ఇష్టమని, రైతుబిడ్డగా పేరుపొందిన పల్లవి ప్రశాంత్ తరహాలో తననూ ఎప్పటికైనా గుర్తిస్తారని ఆశిస్తున్నానంటున్నాడు.





నీటిపారుదల శాఖలో అవినీతి లీలలు

- కారుణ్య నియామకాలకు లక్షల్లో వసూళ్లు
- ఏళ్ల తరబడి సర్కిల్ కార్యాలయంలో విధులు
- కలెక్టర్‌కు ఫిర్యాదుకు సిద్ధమైన టీఎన్జీవో నేతలు

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో ఓ అధికారి అవినీతి లీలలు ఒక్కొ క్కటిగా బయటకు వస్తున్నాయి. ఏళ్ల తరబడి ఒకే దగ్గర పని చేయడంతో ఉన్నతాధికారుల పేరు చెప్పి లక్షల్లో డబ్బులు వసూళ్లు చేస్తున్నట్లు బాధిత ఉద్యోగులు చెబుతు న్నారు. హనుమకొండ చింతగట్టు క్యాంపు చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఓ అధికారి వివిధ విభాగాల్లో పని చేసే అటెండర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, సూపరింటెం డెంట్ కేడర్ వరకు పనిచేసే అధికారులు, సిబ్బంది వద్ద లక్షల్లో డబ్బులు వసూళ్లు చేసినట్లు చెబుతున్నారు. చీఫ్ ఇంజనీర్ కార్యాల యంలో సీనియారిటీ ప్రకారం బదిలీలు, ప్రమోషన్లు నిబంధనల ప్రకారం చేపట్టాలి. ఏళ్ల తరబడి ముఖ్య అధికారి కార్యాలయానికి అనుబంధంగా ఓ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న అధికా రి డబ్బులు ఇస్తేనే అపాయింట్‌మెంట్ లెటర్లు, డబ్బులు ఇవ్వ కుంటే నెలల తరబడి తిప్పించుకోవడం చేస్తున్నట్లు ఆ శాఖలో పనిచేస్తున్న కొంతమంది అధికారులు వాపోతున్నారు. నీటిపారుదల శాఖలో పనిచేసే అటెండర్ కొన్ని నెలల కిందట గుండెపోటుతో మరణిస్తే తన భార్యకు కారుణ్య నియామకం కోసం రూ.లక్ష వరకు వసూలు చేసి ఇంకా డబ్బుల కోసం డిమాండ్ చేస్తున్న ట్లు ఉద్యోగులు చర్చించుకుం టున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు, ప్రమోషన్లు చేస్తున్న ట్లు టీఎన్జీవో యూనియన్ అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఇటీవల చీఫ్ ఇంజనీర్ దృష్టికి తీసుకుపోయినప్పటికీ సూపరింటెండెంట్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిసింది. 2021 నుంచి అతడిపై ఉద్యోగులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం వెనుక ముఖ్య అధికారి పాత్ర ఉందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై కలెక్టర్, విజిలెన్స్ విచారణ జరిపించాలని శాఖలో పనిచేసే ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ములుగు
శుక్రవారం 7 ఫిబ్రవరి 2025

మినీ జాతరకు సన్నద్ధం

- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు
- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ దివాకర



జంపన్నవాగు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

తాడ్వాయి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 12 నుంచి 15 వరకు మేడారంలో జరుగనున్న సన్నద్ధమవుతున్నట్లు కలెక్టర్ దివాకర అన్నారు. తాడ్వాయి మండలంలోని మేడారంలో పలు శాఖల అధికారులతో కలిసి ఆయన గురువారం పర్యటించారు. వైద్యశిబిరం, జంపన్నవాగు వద్ద స్నాఘట్టాలు, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఏర్పాట్లు చేసిన గదులను పరిశీలించారు. అనంతరం గద్దెల ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధి అధికారులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మినీ జాతరకు 10 నుంచి 20లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేసినవట్లు తెలిపారు. జాతర సందర్భంగా నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వైద్యసిబ్బంది 24గంటలు అందుబాటులో ఉంటారని తెలిపారు. అన్ని రకాల మందులను సమంకూర్చుతున్నామన్నారు. అత్యవసర సమయంలో ఇబ్బందులకు గురయ్యే వారిని జిల్లా కేంద్రానికి తరలించడానికి 108 వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట, చోరీలు జరగకుండా పోలీసు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జంపన్నవాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులచే నిరంతరం శుభ్రం చేయించాలని డీపీవోను ఆదేశించారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖను ఆదేశించారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న సందర్భంగా గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. దాదాపు రూ. 5కోట్ల 30లక్షలతో వివిధ రకాల పనులను పూర్తి చేయాలన్నారు. జాతరను పురస్కరించుకొని పలుచోట్ల ప్రత్యేకంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామన్నారు. తాగునీటి కొరత లేకుండా నిరంతరం నీటిని సరఫరా చేయనున్నట్టు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే మినీ జాతర కోసం ఆర్టీసీ అధికారులు హనుమకొండ నుంచి మేడారం వరకు నిరంతరం బస్సులు నడిపించాలని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు తమ మొక్కులను చెల్లించుకొని తిరుగు ప్రయాణం కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నలువాల రవీందర్, డీపీవో ఒంటేరు దేవరా జు, జిల్లా వైద్యశాఖ అధికారి గోపాల్‌రావు, ఐబీ ఈఈ నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోతో మాట్లాడుతున్న కలెక్టర్

కులగణన బూటకం : బీజేపీ

వెంకటాపూర్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): కులగణన పచ్చి బూటకమని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు భూక్య జవహర్‌లాల్ ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. గణన అనంతరం న్యాయం చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఏడు శాతం ఉన్న ఓసీలను 15శాతానికి పెంచి, బీసీలను తక్కువ చేసి చూపించడం దారుణమన్నారు. రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్న బీసీలను మోసం చేస్తోందని విమర్శించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వాజేడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాయిగుడెం మండలం సర్వాయిపేటకు చెందిన ఉమ్మడి రాజు వ్యక్తిగత పనిమీద బైక్‌పై వెంకటాపురం మండలానికి వెళ్తున్న క్రమంలో మండలంలోని అరుణాచలపురం సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టరును తప్పించబోయాడు. దీంతో బైక్ పైనుంచి కిందపడిపోవడంతో అతడి కాలికి గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా రాజును ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. ఘటన స్థలాన్ని వెంకటాపురం సీఐ బండారి కుమార్ పరిశీలించారు.

అవగాహన లోపంతో ఇంటింటి సర్వే

వెంకటాపూర్, ఫిబ్రవరి 6, (ఆంధ్రజ్యోతి): అవగాహన లోపంతో ఇంటింటి సర్వేచేపట్టి ఎస్సీలకు తీరని అన్యాయం చేశారని మాల మహానాడు రాష్ట్ర నాయకుడు నూనె శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని నర్సాపూర్ గ్రామంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయనమాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీలకు న్యాయం చేయాలన్నారు. లేదంటే మాలల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు జిల్లా నాయకులు రాజమౌళి, రాజయ్య, శ్రీనివాస్, రమేష్, సంపత్, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

వాజేడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపనకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠాపన రెండో రోజున గ్రామంలోని దంపతులతో హోమం, కుంకుమపూజ, విగ్రహాలకు పాలాభిషేకం, విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలోని బొడ్రాయి పూజలకు వివిధ ప్రాంతాలలో ఉన్న ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

పత్తి కొనుగోళ్లకు తాత్కాలికంగా బ్రేక్

ములుగు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పత్తి జిన్నింగ్ మిల్లుల వద్ద నిల్వలు అధికంగా ఉన్నందును సీసీఐ ద్వారా కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఆర్.శ్రీదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 11 వరకు కొనుగోళ్లు జరగవని, 12 నుంచి పునరుద్ధరిస్తామని తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

హరీశ్‌రావును కలిసిన మాజీ సర్పంచ్‌లు

పెండింగ్ బిల్లులు ఇప్పించాలని విజ్ఞప్తి



హరీశ్‌రావుతో మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు

ములుగు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రమంత్రి టి.హరీశ్‌రావును ములుగు జిల్లాకు చెందిన మాజీ సర్పంచ్‌లు కలిశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌కు వెళ్లిన వారు హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇప్పించేలా చొరవ తీసుకోవాని కోరారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని, న్యాయం జరిగేలా చూస్తామని హరీశ్‌రావుకు వారికి భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు భూక్యా పవన్‌కుమార్, గుగులోతు తిరుపతి, చంద కుమారస్వామి, బీఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్, యాకూబ్‌నాయక్ పాల్గొన్నారు.

గీత కార్మికులు రక్షణ కవచం సద్వినియోగం చేసుకోవాలి

ఏటూరునాగారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న రక్షణ కవచాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ములుగు జిల్లా అధికారి రవీందర్‌రెడ్డి, ఎక్సైజ్ ఎస్సై వీరస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వై-జంక్షన్ వద్ద గల రేణుక ఎల్లమ్మ గుడి ఆవరణలో కల్లు గీత కార్మికులకు సేఫ్టీ మోకుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటి చెట్లు ఎక్కడం ప్రమాదమైన వృతి అని, అందుకని ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కిట్లను ప్రతి గీతా కార్మికులు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం కల్లు గీత కార్మిక సంఘం ములుగు జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కాటమయ్య రక్షణ కిట్స్‌ను ఏజెన్సీ నాన్ ఏజెన్సీ అనే తేడా లేకుండా ప్రతి గీత కార్మికునికి కిట్స్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ గుండెబోయిన రవిగౌడ్, రంగు సత్యనారాయణ గౌడ్, పులి రమేష్ గౌడ్, బుర్ర శ్రీనివాస్, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు చిక్క అశోక్ గౌడ్, సొసైటీ అధ్యక్షుడు తాళ్లపల్లి నరేందర్ గౌడ్, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావూద్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం జరిగిందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ. దావూద్ విమర్శించారు. తెలంగాణ ప్రజా సంఘాల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో సీఐటీయూ నాయకులతో కలిసి ఆయన కేంద్ర బడ్జెట్‌పై నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రలకు ఏ మాత్రం బడ్జెట్ కేటాయించకుండా సవితి తల్లి ప్రేమ చూపారని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీ పార్టీకి చెందిన 8 మంది పార్లమెంట్ సభ్యులు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా ఏమీ సాధించుకోలేకపోయారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్డీ. యాకూబ్, బండారి నర్ససింహులు, బోట కృష్ణ, నాయిని కృష్ణ, బాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై అశోక్ అందుకు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన గుండారం నరేష్ (35)కు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో కొంతకాలంగా నరేష్ మద్యానికి బానిసె భార్యతో నిత్యం గొడవ పడుతుండేవాడు. దీంతో ఆమె తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన నరేష్ బుధవారం రాత్రి 11 గంటల సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు అతడి తల్లి వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

మహదేవపూర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై ఆమోదం తెలపడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు మహదేవపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు గురువారం క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్మరంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లేతకారి రాజబాబు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్బర్‌ఖాన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, నాయకులు కటకం అశోక్, గుడాల శ్రీనివాస్, వామన్‌రావు, డాక్టర్ శంకర్, గంగయ్య, మాజీ ఎంపీటీసీ సుధాకర్, మండల ప్రధాన కార్యదర్శి చేకూర్తి శంకరయ్య, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : లిబరేషన్

టేకుమట్ల, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని చలివాగులో పడి మృతి చెందిన విద్యార్థి పురాణం సంతోష్ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఐ (ఎంఎల్)- లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేష్ డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబాన్ని పంగిడిపల్లిలో ఆయన గురువారం పరామర్శించారు. వసతి గృహాలను బాధ్యతాయుతగా నడిపించాల్సిన అధికారులు విద్యార్థులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. హాస్టల్ వార్డెన్,సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వల్లే సంతోష్ చలివాగు వద్దకు వెళ్లి మృతి చెందాడన్నారు. ఆయన వెంట బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి పుట్ట మధు పరామర్శ



కాటారంలో పరామర్శిస్తున్న పుట్ట మధు, బీఆర్ఎస్ నేతలు

కాటారం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం పర్యటించారు. కాటారంలో బీఆర్ఎస్ నాయకుడు కొండపర్తి రమేష్‌చారి తండ్రి సమ్మయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా మధు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, బీఆర్ఎస్ జిల్లా నేత జక్కు రాకేష్, నాయకులు మందల లక్ష్మారెడ్డి, పూర వెంకటేశ్వర్‌రావు, బాసాని రవి, వంగల రాజేంద్ర చారి, గాలి సదవలి, జక్కు శ్రావణ్, చీమల వంశీ, ఎల్లయ్య, రామిళ్ల రాజు, దుర్గారావు, రాజమౌళి, రమేష్ తదితరులు ఉన్నారు.

- మల్హర్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రారంలో ఇటీవల మృతి చెందిన రాజమణి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్‌రావు, హరీష్, యాదగిరిరావు తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

మహదేవపూర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి విద్యా సంవత్సరం ఎనిమిదోవ తరగతి విద్యార్థులకు నిర్వహించే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఈ విద్యా సంవత్సరం మహదేవపూర్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు నారిశెట్టి అక్షిత, వసంత అనుజ్ఞ ఎంపికయ్యారు. ఈమేరకు ప్రధానోపాధ్యాయురాలు పి.సరిత తెలిపారు. గురువారం విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మడక మధు, సుధారాణి, సరిత, ఓలిపాషా, శ్రీనివాస్, వసుధప్రియ, వీరేశం, సమ్మయ్య, లీలారాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం



రోడ్డుపై విరిగిపడ్డ స్తంభం

కాటారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటారం-మంథని ప్రధాన రహదారిపై ధన్వాడ వద్ద బుధవారం రాత్రి లోడ్‌తో వెళ్తున్న లారీ తీగలను బలంగా తాకడంతో విద్యుత్ స్తంభం రోడ్డుపై విరిగిపడి తీగలు తెగిపడ్డాయి. దీంతో సమీపంలోని ఇళ్ల వారు గమనించి రోడ్డుకిరువైపులా వచ్చే వాహనదారులను అప్రమత్తం చేస్తూ సంఘటనాస్థలానికి దూరంగా నిలిపేలా చూడటంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ స్తంభం విరిగిపడటంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించగా పలు గ్రామాలకు కరెంట్ సరఫరా నిలిచిపోయింది.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జంగేడు శివారు గల మిరప తోటల్లో జిల్లా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ ఉద్యానవన విశ్వవిద్యాలయం, జేవీఆర్ ఉద్యాన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు కె. నాగరాజు, పాథాలజీ శాస్త్రవేత్త ప్రశాంత్ క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మిరపలో సమగ్ర సస్యరక్షణ, మేలైన యాజమాన్యం పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నేలలో సేంద్రియ కర్బనం పెంచితేనే నేలసారం మెరుగవుతుందని, తద్వారా మొక్కలు తోటలో వేసిన ఎరువులను మెరుగ్గా ఉపయోగించుకుని అధిక దిగుబడులు సాధిస్తారని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఉద్యాన అధికారి సునీల్, రైతులు గంపల సంజీవ్, వేషాల సాంబయ్య, గుడిపాటి సుధాకర్‌రెడ్డి, బానోతు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల- భూపాలపల్లి రోడ్డును పూర్తి చేయాలి

మల్హర్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : తాడిచర-భూపాలపల్లి రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన తాడిచర్లలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాటాడుతూ గత ఎన్నికల్లో ప్రస్తుత శాసన సభ్యులు, మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ మాజీ ప్రజా ప్రతినిధులు తాడిచర్ల- భూపాలపల్లి రోడ్డు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ప్రజలను నమ్మించి వాళ్ల ఓట్లతో గెలిచి 14 నెలలు కావస్తున్నా పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే మాజీ శాసన సభ్యులు పుట్ట మధుకు పేరు వస్తుందన్న దురుద్దేశంతోనే కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గోనె శ్రీనివాస్, ఎం.డి.తాజొద్దీన్, రావుల కల్పన, జాగిరి హరీశ్, సుంకరి సత్తయ్య, మధు సూదన్‌రావు, రమేష్, రాజేశ్వర్‌రావు, సమ్మయ్య, రమేష్, కిషన్, శంకర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

మంగపేట, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో సుమారు 18 లక్షల మంది నేతకాని కులస్థులు జీవనం సాగిస్తున్నారని, ఆ జాతి కుటుంబాలు కడు పేదరికంలో బతుకుతున్నారని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దిగొండ కాంతారావు ఆవేదన వ్యక్తం చేశారు. నేతకానీ కులస్థులకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మంగపేటలో గురువారం జరిగిన సంఘం మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా నిష్పత్తి ప్రకారం ప్రభుత్వాలు నేతకానీలకు రాజకీయ రంగాల్లో ప్రత్యేక కోటా కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతకాని కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నేతకానీలకు ప్రస్తుత అసెంబ్లీలోనే జనాభా శాతాన్ని పరిగణనలోకి తీసుకొని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పూసాల నర్సింహరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి రాంబాబు, జిల్లా ప్రచార కార్యదర్శి దుర్గం నర్సింహరావు, భీమ్ సైనిక్ దళ్ మండల అధ్యక్షుడు జిమ్మిడ నాగేశ్వర్‌రావు, సంఘం జిల్లా నాయకులు బసారి హరికృష తదితరులు పాల్గొన్నారు.

విపత్కర పరిస్థితుల్లో సమయస్ఫూర్తి కనబర్చాలి

ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ఎస్కే బెహ్రా

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): విపత్కర సమయాల్లో సమయస్ఫూర్తిగా వ్యవహరించాలని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండర్ ఎస్కే బెహ్రా సూచించారు. గురవారం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుములు, మెరుపులు, పిడుగులు, వడగండ్లు, ఈదురుగాలులు వీచినప్పుడు ప్రజలు భయాందోళనకు గురి కావద్దని అన్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ప్రమాదాల నుంచి బయటపడొచ్చన్నారు. అనంతరం పలు డెమోలు, మాక్‌డ్రిల్ కార్యక్రమాలు చేపట్టగా ప్రజలు ఆసక్తిగా తిలకించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీ డీవో నాగరాజు, ఆర్ఐ రామస్వామి, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



గ్యాస్ సిలిండర్ నుంచి వచ్చే మంటలను ఆర్పే విధానంపై డెమో

బీసీలను అణగదొక్కాలని కాంగ్రెస్ కుట్ర

ఓబీసీ మోర్చా నాయకుడు రాజేంద్రప్రసాద్

కాటారం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఒక వర్గానికి మేలు చేసేందుకు బీసీలకు రిజర్వేషన్లు తగ్గించి అణగదొక్కాలని కుట్ర చేస్తోందని బీజేపీ అనుబంధ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూసాల రాజేంద్రప్రసాద్ విమర్శించారు. మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు పాగె రంజిత్‌కుమార్ అధ్యక్షతన గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించగా రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కామారెడ్డిలో కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్ ప్రకటించినట్లు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లిం బీసీలు ఎక్కడి నుంచి వచ్చారని, బీసీ, ఎస్సీ, ఎస్టీల జనాభా తగ్గితే ఓసీల జనాభా ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడటానికి ప్రభుత్వం కృషి చేస్తుంటే బీసీ మంత్రులు సీఎం రేవంత్‌రెడ్డికి భజన చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు పాగె రంజిత్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు దుర్గం తిరుపతి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అరూరికి మాజీ ఎమ్మెల్యేల పరామర్శ

జఫర్‌గడ్, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి) : వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ ఇటీవల మరణించడంతో ఉప్పుగల్లులో ఆమె చిత్రపటం వద్ద గురువారం మహబూబాబాద్, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యేలు బానోత్ శంకర్‌నాయక్, గండ్ర వెంకటరమణతోపాటు పరకాల బీజేపీ నాయకులు డాక్టర్ పి.విజయ్‌చందర్‌రెడ్డి, తదితర నేతలు నివాళులర్పించారు. రమేశ్‌ను పరామర్శించి ఓదార్చారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు

కుమ్మరి నాగేశ్వర్‌రావుది ప్రభుత్వ హత్యే..

దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు జనార్దన్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కుమ్మరి నాగేశ్వర్‌రావు ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని బీజేపీ అనుబంధ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ అన్నారు. నాగేశ్వర్‌రావు మృతికి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వినుకోళ్ల చక్రవర్తి అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ నాగేశ్వర్‌రావు మృతికి కారుకులైన ప్రభుత్వ అధికారులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని అన్నారు. సమావేశంలో గిరిజన మోర్చా జిల్లా మాజీ అధ్యక్షుడు గండేపల్లి సత్యం, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కర్ని సంపత్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఎలుకపల్లి శ్రీనివాస్, మండల కార్యదర్శి నరాల రవి తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన తల్లి

వాజేడు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): సృష్టిలో తల్లి ప్రేమను మించింది మరేదీ లేదంటారు. అది మనుషులకే కాదు.. జంతువుల కూడా ఉంటుందని ఆ తల్లి కుక్కను చూస్తే అర్థమవుతుంది. మండలంలోని జగన్నాధపురం ప్రధాన కూడలిలో గురువారం గుర్తు తెలియని వాహనం ఢీకొని పిల్ల కుక్క మృతి చెందింది. దీంతో తల్లి కుక్క తల్లడిల్లిపోయింది. పిల్ల కుక్క కళేబరం వద్ద తీవ్రంగా రోదించింది. రోజంతా పిల్ల కుక్క వద్దకు వస్తూ.. వెళ్తూ గడిపింది. ఈ దృశ్యం స్థానికులను కలచి వేసింది. జంతువుకైనా, మనిషికైనా తల్లి ప్రేమ ఒక్కటేనని ఈ సంఘటన చాటి చెప్పింది.



పిల్లకుక్క కళేబరం వద్ద తల్లికుక్క